# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 29-03-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **భారత్‌లో వ్యవసాయ, ఆరోగ్య, విద్యా రంగాలలో మార్పులకు సాంకేతిక పరిజ్ఞానం కీలకపాత్ర పోషిస్తోందని ప్రధానమంత్రి, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**

**2.** **రాష్ట్ర ముఖ్యమంత్రి, వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఈరోజు కర్నూలు జిల్లాకు చేరుకుంది.**

**3.** **రాష్ట్రంలో జరగనున్న లోక్‌సభ, శాసనసభ ఎన్నికలలో పోలింగ్ శాతాన్ని గణనీయంగా పెంచడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం తీవ్రంగా కృషి చేస్తోంది.**

**4.** **తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తిచేశామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు ఎన్. చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.**

**5.** **జేఈఈ మెయిన్స్- 2024 సెషన్-2 పరీక్షలకు కేంద్రాలను కేటాయించినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తెలిపింది.**

==========================

భారత్‌లో వ్యవసాయ, ఆరోగ్య, విద్యా రంగాలలో మార్పులకు సాంకేతిక పరిజ్ఞానం కీలకపాత్ర పోషిస్తోందని ప్రధానమంత్రి, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అమెరికాకు చెందిన మైక్రో సాఫ్ట్ సంస్థ మాజీ ముఖ్య కార్యనిర్వహాక అధికారి బిల్‌గేట్స్ నరేంద్ర మోదీతో ఢిల్లీలో ఈరోజు సమావేశమైన సందర్భంగా పలు అంశాలపై వారిరువురూ చర్చించారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ మాట్లాడుతూ...భారత్‌లో కొత్త సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడానికి మహిళలు మరింత సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రస్తుతం భారత్‌లో డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం సాధించిన ప్రగతితో ప్రభుత్వ పథకాలన్నీ నేరుగా పేదలకు అందుతున్నాయని వివరించారు. G-20 సదస్సు సందర్భంగా...భారత్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పరిజ్ఞానాన్ని వినియోగించిందని నరేంద్ర మోదీ వెల్లడించారు.

-------------------------

రెండో విడత లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ నిన్న జారీ అయింది. ఈ దశలో 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 88 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఔటర్ మణిపూర్ నియోజకవర్గంలోని కొంత

భాగానికి తొలిదశలో ఎన్నికలు జరగనున్నాయి. కేరళలో 20, కర్ణాటకలో 14, రాజస్థాన్లో 13, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలో ఎనిమిది, మధ్యప్రదేశ్‌లో ఏడు, అస్సాం, బీహార్‌లో ఐదు, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌ఘఢ్‌లో మూడు, మణిపూర్, త్రిపుర, జమ్మూ కాశ్మీర్‌లో ఒక్కో స్థానంలో , రెండో దశలో ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 4వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. పోలింగ్ ఏప్రిల్ 26న జరుగుతుంది. జమ్మూ కాశ్మీర్ మినహా అన్ని రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలలో నామినేషన్ల పరిశీలన ఏప్రిల్ 5వ తేదీన జరగనుండగా... జమ్ముూకాశ్మీర్‌లో, నామినేషన్ల పరిశీలన ఏప్రిల్ 6వ తేదీన జరుగుతుంది.

---------------------------

రాష్ట్ర ముఖ్యమంత్రి, వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై. ఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర నంద్యాల జిల్లాలో ముగించుకుని కర్నూలు జిల్లాకు చేరుకుంది. ఈ రోజు మొత్తం ఈ జిల్లాలో బస్సు యాత్ర సాగనుండటంతో 'కర్నూలు జిల్లా సిద్ధమా?' అని జగన్‌మోహన్ రెడ్డి సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశారు. నేటి యాత్రలో భాగంగా సాయంత్రం ఎమ్మిగనూరు బహిరంగ సభలో ఆయన ప్రసంగించనున్నారు.

---------------------------

రాష్ట్రంలో జరగనున్న లోక్‌సభ, శాసనసభ ఎన్నికలలో పోలింగ్ శాతాన్ని గణనీయంగా పెంచడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం తీవ్ర కృషి చేస్తోంది. ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని ప్రాంతాలలో పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లాల కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీ చేస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా పోలింగ్ శాతం పెంపు, పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలను కల్పించే అంశంపై అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఎన్.టి.ఆర్. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. ఢిల్లీరావు విజయవాడ నగరంలో నిన్న సంబంధిత విభాగాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ ..... విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్‌లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఓటింగ్ శాతం 80 నుండి 85 శాతం నమోదయ్యేలా స్వీప్ కార్యక్రమం ద్వారా చేపడుతున్న అవగాహనా కార్యక్రమాలపై కూడా ఢిల్లీరావు సమీక్ష జరిపారు. ఇలా వుండగా.... ఎన్.టి ఆర్. జిల్లాలో ఇప్పటివరకు 85 ఏళ్లు పైబడిన 9 వేల 572 మంది, విభిన్న ప్రతిభా వంతులు 14 వేల 838 మంది ఓటర్లుగా నమోదైనట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

---------------------------

ఈరోజు గుడ్ ఫ్రైడే సందర్భంగా ఏసుక్రీస్తు త్యాగాన్ని ప్రధానమంత్రి, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నరేంద్ర మోదీ స్మరించుకున్నారు. యేసుక్రీస్తు చేసిన త్యాగం మనకు కరుణ, క్షమాగుణాలను బోధిస్తుందనీ, ఆయన బోధనల ద్వారా అందరూ స్ఫూర్తిని పొందుతారని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు.

మానవాళి కోసం కరుణామయుని మహాత్యాగమే గుడ్ ఫ్రైడే అని, యేసుక్రీస్తు జీవితమే మానవాళికి గొప్ప సందేశమని రాష్ట్ర ముఖ్యమంత్రి, వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. 'మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం.. ఇవన్నీ తన జీవితం, బోధనల ద్వారా యేసుక్రీస్తు లోకానికి ఇచ్చిన సందేశాలని జగన్ మోహన్ రెడ్డి గుడ్ ఫ్రైడే సందర్భంగా తన సందేశాన్ని సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు.

---------------------------

తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పోలవరం ప్రాజెక్టును 72 శాతం మేరకు పూర్తిచేశామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు ఎన్.చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఆయన ఈరోజు నంద్యాల జిల్లా బనగానపల్లెలో నిర్వహిస్తున్న "ప్రజాగళం" ప్రచార యాత్రలో పాల్గొని మాట్లాడుతూ… తమ పార్టీ అధికారంలో విద్యుత్ రంగంలో సంస్కరణలు చేపట్టామని, అనంతపురానికి కియా పరిశ్రమను తీసుకువచ్చామని తెలిపారు. గోదావరి జలాలను రాయలసీమకు తేవాలనేదే తమ సంకల్పమని, సంపద సృష్టించి పేదలకు పంచడమే తమ పార్టీ ధ్యేయమని చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.

---------------------------

జేఈఈ మెయిన్స్- 2024 సెషన్-2 పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్ష కేంద్రాలను కేటాయించినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ -ఎన్టీఏ తెలిపింది. దేశవ్యాప్తంగా 309, విదేశాల్లో 19 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. వచ్చే నెల 4, 5, 6, 8, 9 తేదీల్లో పేపర్-1 -బీఈ, బీటెక్, 12వ తేదీన పేపర్- 2 బీఆర్క్ పరీక్షలు జరగనున్నాయి. పూర్తి వివరాలకు jeemain.nta.ac.in ను సందర్శించాలని ఎన్టీఏ ఒక ప్రకటనలో పేర్కొంది.

---------------------------

మూడు రోజుల పర్యటనలో భాగంగా జనసేన పార్టీ అధ్యక్షులు కె.పవన్ కళ్యాణ్ రేపు కాకినాడ జిల్లా పిఠాపురం నుండి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయన రానున్న అసెంబ్లీ ఎన్నికలలో పిఠాపురం నుండి పోటీ చేయనున్న నేపథ్యంలో అక్కడ నుండే ప్రచారం ప్రారంభిస్తారని తెలిపాయి. కాగా… తొలుత శక్తిపీఠాన్ని సందర్శించి, పాదగయ క్షేత్రంలో పవన్ కళ్యాణ్ పూజలు చేస్తారనీ, వారాహి వాహనానికి ప్రత్యేక పూజల అనంతరం ప్రచారం మొదలు పెడతారని పేర్కొన్నాయి. ఈ పర్యటన అనంతరం ఆయన ఉత్తరాంధ్రలో ప్రచారానికి బయలుదేరుతారనీ, తొలి విడత పర్యటనలో భాగంగా మొత్తం 11 రోజుల పాటు 8 నియోజక వర్గాల్లో పర్యటిస్తారనీ వెల్లడించాయి.

---------------------------

కాకినాడలో భారత్, అమెరికా సంయుక్త, సైనిక విన్యాసాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ విన్యాసాలలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలను కాపాడే చర్యలపై ఇరుదేశాల సైనికులు ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఈ సంయుక్త సైనిక విన్యాసాలు 18వ తేదీన విశాఖపట్టణంలో ప్రారంభమయ్యాయి

---------------------------

రాష్ట్రంలో పీహెచ్ డీ ప్రవేశాలకు నిర్వహించే ఆర్ సెట్ 2023-24 దరఖాస్తు గడువును పొడిగిస్తున్నట్లు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దేవప్రసాద్ రాజు తెలిపారు. 2 వేల రూపాయల అపరాధ రుసుముతో ఏప్రిల్ 3వ తేదీ వరకు, 5 వేల రూపాయల అపరాధ రుసుముతో ఏప్రిల్ 6 వ తేదీ వరకు గడవు పొడిగిస్తున్నట్లు తెలిపారు.

---------------------------

గుంతకల్లు రైల్వే పరిధిలో జరుగుతున్న పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేయడంతోపాటు కొన్నింటిని దారి మళ్లించినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలియచేసింది. ఏప్రిల్ 3 వ తేదీ నుంచి 10 వరకూ కేఎస్ఆర్ బెంగళూరు-ధర్మవరం రైళ్లు రద్దు చేసినట్లు పేర్కొంది. ఏప్రిల్ 7,8వ తేదీల్లో గౌరీబిదనూర్-ధర్మవరం మధ్య మాత్రమే రాకపోకలు సాగిస్తాయని జైపూర్-మైసూర్ ఎక్స్‌ప్రెస్‌ను ఏప్రిల్ 1వ తేదీ నుంచి 8 వరకు, గుంతకల్లు, బళ్లారి, రాయదుర్గం, అరిశికేరి, హసన్ మీదుగా మళ్లించినట్లు తెలిపింది. కలబురిగి-బెంగుళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్

ఏప్రిల్ 3 వ తేదీ నుంచి 10 వ తేదీ వరకు 5 గంటల 20 నిముషాలు ఆలస్యంగా నడుస్తుందనీ, మరో వందేభారత్ రైలు గంట ఆలస్యంగా రాకపోకలు సాగిస్తుందని ప్రయాణికులు గమనించాలని సూచించింది.

---------------------------

కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలైంది. 2024-25 విద్యా సంవత్సరానికి గాను 1వ తరగతిలో ప్రవేశాలకు ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 15 వరకు, 2 నుండి10 వ తరగతి వరకు ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కేవీ సంఘటన్ సూచించింది. ఒకటో తరగతిలో అడ్మిషన్ పొందాలనుకునే చిన్నారుల వయసు మార్చి 31, 2024 నాటికి ఆరేళ్లు పూర్తికావాలని పేర్కొంది. పూర్తి వివరాలకు కేవీ వెబ్‌సైట్ చూడవచ్చు.

=======================